క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జాతీయ స్థాయిలో నిర్వహించిన వేమన పద్యాల పోటీల్లో పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ క్రమంలో పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పాఠశాలలో ప్రతిభ చూపిన పావని, లక్ష్మీ ప్రసన్నలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

రీసర్వేతో పక్కాగా రికార్డులు



ఇందుకూరుపేట: రీసర్వేతో రికార్డులు పక్కాగా రైతులకు అందుతాయని ఇన్‌చార్జి తహసీల్దార్ గోపీకృష్ణ అన్నారు. మండలంలోని గంగపట్నంలో రీసర్వేపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియలో రైతులకు సరైన హద్దులు ఏర్పాడుతాయన్నారు. దీనివల్ల సాగుతో పాటు క్రయ విక్రయాలకు ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. రీసర్వేలో ఏదైనా సమస్యలు ఉంటే రైతులు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. రీసర్వే డీటీ శివప్రసాద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ కార్మికులు గురువారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈఓ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వేతన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. రవాణా చార్జీలు పెంచాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు మల్లికార్జున, అన్నపూర్ణమ్మ, గాయత్రి, సునీత తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం వినాయకనగర్ గిరిజన కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పూరిళ్లు పూర్తిగా దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాలనీలోని గిరిజన చిన్నారులకు యానాదుల హెల్త్, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి పొట్లూరి శ్రీనివాసులు, గిరిజన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రసాద్ గురువారం తినుబండారాలు పంపిణీ చేశారు.

దేవదాయ అధికారులతో రైతుల వాగ్వాదం

తోటపల్లిగూడూరు: మండలంలోని సౌత్‌ఆములూరులో ఉన్న నెల్లూరు రంగనాయకుల స్వామి ఆలయ భూముల కౌలు వేలం పాటలో గందరగోళం నెలకొంది. స్వామికి గ్రామంలో 220 ఎకరాలు పైగా భూములున్నాయి. ఇందులో 94.32 ఎకరాలకు గానూ 92.40 ఎకరాలకు గురువారం కౌలు వేలం పాట నిర్వహించారు. ఈ భూములకు గతంలో రూ.10.24 లక్షలకు పాడగా ఈ ఏడాది రూ.24.65 లక్షలు వచ్చింది. ఈఓ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ సామాన్యులకు ఇబ్బందులు గురిచేసేలా జరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకుల అండదండలున్న రైతులకు ఓ విధంగా ఇతరలకు మరోలా పాటలు నిర్వహించారని కొందరు ఆరోపించారు. గతంలో పొలాలు దక్కించుకున్న వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన రైతులకు ఈ దఫా మొండిచేయి చూపించారని మండిపడ్డారు. ఈ క్రమంలో దేవదాయ శాఖాధారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. దీంతో కొంత సమయం గందరగోళం నెలకొంది.

జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు రూరల్: సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ వల్ల రవాణా రంగంలో కలిగే ప్రయోజనాలు తెలిపే పోస్టర్లు, బ్యానర్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆయన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. సుమారు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ధరలు తగ్గినట్లు రవాణా శాఖ అధికారులు వివరించారు. కార్యక్రమంలో జీఎస్టీ కమిషనర్ కిరణ్‌కుమార్, డీటీసీ చందర్, ఆర్టీఓ ఎండీ మథాని, ఎంవీఐ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ ప్రాంగణం.. జలమయం

- చిన్నపాటి వర్షానికే నిలిచిన నీరు

కోవూరు: పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్ర ప్రాంగణం చిన్నపాటి వర్షానికే జలమయమైంది. గురువారం కురిసిన స్వల్ప వర్షానికే ఆస్పత్రి ప్రాంగణమంతా వర్షపు నీరు నిల్వ చేరడంతో రోగులు, గర్భిణులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అభివృద్ధి పేరుతో రూ.కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా, వాస్తవ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. వర్షం తగ్గిన గంటల తర్వాత కూడా నీరు తొలగకపోవడంతో దుర్వాసన వ్యాపించింది. ఏడాది కాలంగా ఇలాంటి పరిస్థితులు ఉన్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల వర్షపు నీరు బయటకు వెళ్లకుండా నిలిచిపోతోందని వారు పేర్కొన్నారు. ఆస్పత్రికి కొత్త భవనాలు, పరికరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పుకుంటున్నా, మౌలిక సదుపాయాలు మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా హాస్పిటల్ పరిసరాల్లో తక్షణమే లెవలింగ్ పనులు చేపట్టాలని, నీరు నిలువకుండా సకాలంలో డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- పట్టణంలోని పచ్చిపాల రామనాథమ్మ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణం చిన్నపాటి వర్షానికే జలమయమైంది. దీంతో విద్యార్థినులు స్కూల్ నుంచి హాస్టల్‌కు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్కూల్ భవనం వెనుక భాగంలో డ్రెయినేజీ సదుపాయం లేకపోవడంతో నీరు నిలిచిపోయిందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు.



కోవూరు సీహెచ్‌సీ ఆవరణలో నిలిచిన వర్షపునీరు

- **ఇందుకూరుపేట:** మండల పరిధిలో గురువారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ పనులకు ఆటంకం కలిగింది. లోతట్టు రహదారులు, వీధుల్లో నీరు నిలిచింది.

జడివానతో బేజారు

పొదలకూరు: జనవాన ప్రజల్ని బేజారెత్తిస్తోంది. గురువారం విడతల వారీగా వాన పడుతూనే ఉంది. పగటి వేళలో వర్షం పట్టుకోవడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. కొంతసేపు ఎండ, ఆ తర్వాత వాన కురిసింది. పట్టణంలో అక్కడక్కడా వీధులు జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులతో పిడుగులు పడతాయని ప్రజలు భయపడుతున్నారు. చిత్తకార్తె ఈనెల 24వ తేదీ వరకు కొనసాగుతుంది.



పొదలకూరు : జలమయమైన వీధి



కోవూరు: వర్షపు నీటిలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు



కోవూరు: జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిలిచిన నీరు

ఇంటి స్థలం ఆక్రమణకు యత్నం

మనుబోలు: మా ఇంటి స్థలాన్ని ఓ కుటుంబం ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తోంది. దీనికి కొందరు అధికార పార్టీ నేతలు సహకరిస్తున్నారు' అంటూ పిడూరుమిట్ట కాలనీకి చెందిన కొరివి శంకరయ్య కుటుంబం ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్‌ను ఆశ్రయించింది. దీంతో ఆ సంస్థ ప్రతినిధులు గురువారం బాధితుడి ఇంటి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధి సాల్మన్‌రాజు మాట్లాడుతూ 40 ఏళ్లకు ముందే శంకరయ్య ఇల్లు నిర్మించుకున్నట్లు చెప్పారు. 30 ఏళ్ల నివాసముంటున్నాడని చెప్పారు. సుమారు పదేళ్ల క్రితం ఇల్లు దెబ్బతినడంతో మరోచోట కట్టుకుని ఉంటున్నట్లు పేర్కొన్నారు. ఐదారేళ్ల క్రితం వరకూ పాత ఇంటి వద్ద దుకాణం కూడా ఉండేదన్నారు. కాగా ఇటీవల పాత ఇంటి మరుగుదొడ్డి, నీటి కుళాయిలను పక్కనే నివాసముంటున్న మోచర్ల రమణయ్య ధ్వంసం చేయడమే కాకుండా ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని తెలిపారు. అధికారులు విచారించి శంకరయ్యకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



వివరాలు తెలుసుకుంటున్న ప్రతినిధులు

పలువురికి ప్రసన్న పరామర్శ

ఇందుకూరుపేట: మాజీ ఎమ్మెల్యే జేకే రెడ్డి మాతృమూర్తి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి అమ్మమ్మ జక్కా కామేశ్వరమ్మకు మాజీ మంత్రి, పార్టీ పీఏసీ రాష్ట్ర సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాళులర్పించారు. జగదేవిపేటలో గురువారం జరిగిన ఆమె ఉత్తర క్రియల్లో ప్రసన్న పాల్గొని, కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు మావులూరు శ్రీనివాసులురెడ్డి, గొల్లపల్లి విజయ్‌కుమార్, కొండూరు అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** ఎంపీటీసీ సభ్యుడు వంగవరపు విజయసేనారెడ్డి సతీమణి ప్రేమలత అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుచ్చిరెడ్డిపాళెం మండలం, దామరమడుగులోని వారి నివాసానికి వెళ్లి ప్రేమలత భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్‌లు అనూప్‌రెడ్డి, సతీష్‌రెడ్డితోపాటు పలువురు నాయకులున్నారు.



ఇందుకూరుపేట: జక్కా కామేశ్వరమ్మ ఉత్తరక్రియల్లో ప్రసన్న, ఆదాల



కోవూరు: ప్రేమలత మృతదేహానికి నివాళులర్పిస్తున్న ప్రసన్న

అనుమతుల్లేకుండా విక్రయిస్తే చర్యలు

మనుబోలు: దీపావళి సందర్భంగా అనుమతి లేకండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రమాదేవి హెచ్చరించారు. గురువారం ఆమె టపాసుల విక్రయదారులతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ షాపుల వద్ద నీరు, ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నివాసాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలంలో ఐదుగురికి మాత్రమే అనుమతి ఇచ్చామన్నారు. బాణసంచా కాల్చే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 100, 101, 112 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.



దుకాణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఎంపీఎఫ్‌సీ గోదాము ప్రారంభం

కొడవలూరు: మండలంలోని గుండాలమ్మపాళెంలో రూ.40 లక్షలతో నిర్మించిన ఎంపీఎఫ్‌సీ గోదామును ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి కోతలైన వెంటనే మార్కెట్‌లో ధాన్యానికి తక్కువ ధర ఉంటుందని, అలాంటి సమయంలో గోదాములో ధాన్యం నిల్వ బెట్టుకొని ధర పెరిగినప్పుడు విక్రయించుకునేందుకు దోహదపడుతుందన్నారు. అంతే కాకుండా విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లను కూడా నిల్వ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి, ఎంపీడీఓ వెంకట సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు వినీల్‌రెడ్డి, స్థానిక నాయకులు పి.సురేష్‌రెడ్డి, జి.రాజా, సాయిమోహన్‌రెడ్డి కె.మల్లికార్జున, కె.వెంకటరమణారెడ్డి, కె.వెంకీ పాల్గొన్నారు.



గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

వీఎస్‌యూలో వరల్డ్ ఫుడ్ డే

వెంకటాచలం: వరల్డ్ ఫుడ్ డే సందర్భంగా మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో గురువారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆహార భద్రత, పోషకాహారం ప్రాముఖ్యతపై ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ సాయినాథ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆ విభాగం అధ్యాపకులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ శారద, డాక్టర్ పావని తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

వెంకటాచలం: జీఎస్టీ ఉత్సవ్‌లో భాగంగా వెంకటాచలం మండలంలోని టోల్‌ప్లాజా వద్ద రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఒక్కో వాహనం ధరలో రూ.10 వేలు నుంచి రూ.1.20 లక్షల వరకు ధర తగ్గుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం టోల్‌ప్లాజా సమీపంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు కోసం రెవెన్యూ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు.

- **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** మున్సిపాలిటీ పరిధిలోని ముంబై రోడ్డు వద్ద కేవీఆర్ కల్యాణ మండపంలో జీఎస్టీ 2.0పై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పాల్గొని, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జీఎస్టీ ఫలాలు ప్రతి పేదవాడికి అందుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, పట్టణ, రూరల్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు కౌలు వేలం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయానికి సంబంధించి లీజు కాల పరిమితి తీరిన భూములకు శుక్రవారం నుంచి కౌలు వేలం పాటలు నిర్వహిస్తామని ఆలయ ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న చిట్టేపల్లి, దామరమడుగు, పాటూరు, బసవాయపాళెం, 18న జొన్నవాడ, పెనుబల్లి, పంచేడు, పూడిపర్తి, పున్నూరు గ్రామాల్లోని ఆలయ భూములకు వేలంపాటలు ఉంటాయని తెలియజేశారు. పూర్తి వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

బాబా మందిరంలో విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రి స్వామి పల్లకి సేవ నిర్వహించారు.

వాగు పొంగే సమయానికి..

- పెద్దవాగు వంతెన పనులు
- త్వరగా పూర్తి చేస్తే గ్రామస్తులకు ఉపయోగం

పొదలకూరు: మండలంలోని నావూరు పెద్దవాగు పొంగే సమయానికి బ్రిడ్జి నిర్మాణ పనులు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. గతేడాది ఎన్నికల ప్రక్రియలో భాగంగా పనులు నిలిచిపోయాయి. 20 శాతం పూర్తి అయిన పనులను తిరిగి చేపట్టాల్సిందిగా ఉత్తర్వులు రావడంతో అధికారులు పనులను తిరిగి మొదలుపెట్టారు. గత ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.3.62 కోట్లు నిధులను మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఇది పూర్తయితే వర్షాకాలంలో చెన్నారెడ్డిపల్లి, నావూరు, నావూరుపల్లి, భోగసముద్రం తదితర గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయి. వాగు చప్టాపై వరదనీరు ప్రవహించి గ్రామాలకు సంబంధాలు తెగిపోతుంటాయి. కొన్ని దశాబ్దాలపాటు వంతెన చెక్కు చెదరకుండా ఉండేలా డిజైన్ చేశారు. చప్టాను అప్పటి ఆత్మకూరు ఎమ్మెల్యే సుందరరామిరెడ్డి చొరవతో నిర్మించారు. వంతెన మాత్రం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి గత ప్రభుత్వంలో మంజూరు చేయించారు. బ్రిడ్జి పొడవు 79.46 మీటర్లు కాగా మొత్తం 12 వెంట్లున్నాయి. వాగుకు ఏ స్థాయిలో నీరు వచ్చినా తట్టుకునే విధంగా బ్రిడ్జిని డిజైన్ చేసినట్టు ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు. పైతట్టు ప్రాంతం నుంచి పెద్దవాగు ప్రవహిస్తుంది.



పెద్దవాగుపై వరద ఉధృతి (ఫైల్)

సెంట్రింగ్ పనులు

వంతెన నిర్మాణం శ్లాబు వరకు వచ్చింది. ఇందుకోసం సెంట్రింగ్ పనులను చేపడుతున్నారు. అయితే లేబర్ సమస్య, వర్షాల వల్ల కొంత పనుల్లో జాప్యం నెలకొంటున్నట్టు తెలుస్తోంది. సెంట్రింగ్ పనులను వేగంగా పూర్తి చేస్తే శ్లాబు నిర్మాణ పనులు చేపట్టి భారీ వర్షాలు, వరదల సమయానికి పనులు పూర్తి చేసి అందజేయాలనే ప్రణాళికతో ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. నవంబర్‌లో తుపాన్లు వస్తే పెద్దవాగు పొంగి ప్రవహించే అవకాశం ఉంది. దీంతో గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోతాయి. ఈలోగా పనులు పూర్తి చేయగలిగితే ఆయా గ్రామస్తులు భారీ వర్షాల్లో సైతం రాకపోకలు సాగించేందుకు అవకాశం కలుగుతుంది.

ప్రతిభావంతులకు ఆర్థిక సాయం

కోవూరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి హాజరై ప్రతిభ చూపిన విద్యార్థులు వేద నక్షత్ర, దిషా, వెన్నెలకు తన సొంత నిధుల నుంచి రూ.10,116 చొప్పున మొత్తం రూ.30,348ల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం నరసింహారెడ్డిని అధికారులు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ శ్రీహరి, జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, ఎంఈఓ చెంచులక్ష్మి, హెచ్‌ఎం సోఫియా కిరణ్మయి, టీచర్ గీతామాధురి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు అందజేస్తున్న నరసింహారెడ్డి

జెడ్పీ స్కూల్లో బాలికా దినోత్సవం

తోటపల్లిగూడూరు: మండలంలోని వరిగొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ తోటపల్లిగూడూరు సెక్టార్ సూపర్‌వైజర్ రంగనాయకమ్మ మాట్లాడుతూ కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కార్యకర్తలకు అండగా ఉంటా

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: పార్టీ జెండా మోసే కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అక్కంపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చంద్రమౌళి అనారోగ్యంతో మృతిచెందాడు. గురువారం భౌతిక కాయానికి కాకాణి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చంద్రమౌళి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రమౌళి మృతి బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. పార్టీ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసే ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ గుండాల వజ్రమ్మ, నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, మండల వెంకటశేషయ్య, పలగాని శ్రీహరిరెడ్డి, దండు అమర్‌నాథ్‌రెడ్డి, అంబటి శ్రీనివాసులురెడ్డి, శేషురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చంద్రమౌళి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కాకాణి

ఇంటికి వెలుగు ఆడపిల్ల

ఇందుకూరుపేట: ఆడపిల్ల ఇంటికి వెలుగు అని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీహెచ్ సుధాకర్ అన్నారు. మండలంలోని జగదేవిపేట ఎస్టీ కాలనీలో 'ఆడపిల్లలను కాపాడుకుందాం' అనే అంశంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిని అభివృద్ధి పథంలో నడపడంలో ఆడపిల్ల పాత్ర కీలకమన్నారు. రాజ్యాంగం పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు కల్పిస్తోందని చెప్పారు. బాల్య వివాహాలను పూర్తిగా అడ్డుకట్ట వేయడం అందరి బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రమా, సీహెచ్‌ఓ నందిని, హెల్త్ అసిస్టెంట్ మాధవ్, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

పడిగాపులు.. పడరాని పాట్లు



బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

- కర్నూలు సభకు తరలిన 250 ఆర్టీసీ బస్సులు
- ఓ వైపు వర్షం, మరో వైపు బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు

నెల్లూరు సిటీ: కర్నూలు జిల్లాలో జరిగిన జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సభకు జిల్లాలోని 250 ఆర్టీసీ బస్సులను తరలించడంతో రెండోరోజు గురువారం కూడా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. అడపాదడపా వచ్చే బస్సుల కోసం ఎక్కువ మంది ఎగబడటంతో సీట్లు దొరక్క.. తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కాగా నగరంలో చదువుకునే గ్రామీణ విద్యార్థులు దీపావళి పండగకు తమ సొంతూళ్లకు వెళ్లేందుకు భారీగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో ఓ వైపు ఎడతెరపి లేని వర్షం, మరోవైపు బస్సు రాకపోవడంతో అసహనానికి గురయ్యారు. ఆర్టీసీ బస్సుల రాకపోకల్లేక బస్టాండ్ ఖాళీగా దర్శనమిచ్చింది. ఈ క్రమంలో ప్రైవేట్ వాహనాలు, ఆటోల్లో తమ ఊర్లకు వెళ్లేందుకు ఆశ్రయించారు. బస్సులు లేకపోవడం, వర్షం పడటంతో ఇదే అదనుగా వారు కూడా అధిక నగదు డిమాండ్ చేశారు. తప్పని పరిస్థితుల్లో కొందరు ప్రయాణికులు అధికంగా చెల్లించి సొంతూళ్లకు వెళ్లారు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



ఒక్క బస్సు కూడా లేని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్